ఈ నాటి సావిత్రి

టెంపోరావ్

నాగేశ్వరరావు టిఫిన్ తిని హాల్లోంచి బయటకు నడిచాడు.

వెనకనే వెళ్ళింది సావిత్రి. డ్రయివరు తోలుపెట్టెను, బ్రీఫ్ కేసును కారు డిక్కీలో పెట్టి మూశాడు. ప్లాస్టిక్ బుట్టను ముందు పెట్టాడు.

వరండాలో నిలబడి నాగేశ్వరరావు తన భార్యవంక నవ్వుతూ చూశాడు.

"నేను తిరిగిరావడానికి నాలుగైదు రోజులు అవుతుంది. జాగ్రత్తగా వుండు" అన్నాడతను.

సావిత్రి నవ్వింది, తీయగా, అమాయకంగా.

"మరేమీ ఫరవాలేదు. ఏ బెంగా లేకుండా మీరు వెళ్ళిరండి" అందామె.

అతడు కారు వెనక సీటుమీద కూర్చుని తలుపు మూశాడు. డ్రయివర్ స్టీరింగ్ వీల్ వెనక సర్దుకుని కూర్చున్నాడు.

నాగేశ్వరరావు భార్యవంక చిరునవ్వుతో చూశాడు. కారు గేటువైపు మెల్లిగా కదిలింది. చెయ్యి ఊపుతూ ఆమె భర్తకు బైబై చెప్పింది.

కాస్సేపట్లో గేటు దాటి, కుడివైపుకు తిరిగి కారు అదృశ్యమైంది.

సావిత్రి పుషారుగా హాల్లోకి వెళ్ళి సోఫాలో కూర్చుంది. టైమ్ చూసింది. తొమ్మిది దాటింది.

తన జీవితాన్ని గురించి ఆమె సింహావలోకనం చేసుకుంటోంది. తన పెళ్ళయి ఆరేళ్ళు దాటింది. తలిదండ్రులకు తను ఒక్కగానొక్క కూతురు. తండ్రి పోయాక అతడు విజయవంతంగా నడుపుతున్న నిటింగ్ ఫాక్టరీ తన భర్త చేతుల్లోకి వచ్చింది. తన తల్లి పెళ్ళిముందే పోయింది. పెద్ద మేడ, ఫాక్టరీ, తన తండ్రి ఆస్తంతా భర్త వశమైంది. తన సంసారం సుఖంగా సాగుతోంది. తనకు ఏ లోటూ లేకుండా జీవితం సాగిపోతోంది. అంతకంటె స్త్రీకి ఏం కావాలి?

టెలిఫోన్ మ్రోగింది. సావిత్రి లేచివెళ్ళి రిసీవర్ని అందుకుని, "హలో!" అంది.

"హలో, నాగేశ్వరరావుగారు వున్నారా?" ఒక స్త్రీ కంఠం అడిగింది.

"ఆయన కారులో బెంగుళూరు వెళ్ళారు."

"వెళ్ళి ఎంతసేపయింది?"

"ఇప్పుడే వెళ్ళారు" అంది సావిత్రి.

"థాంక్స్" అని అటువైపు స్త్రీ రిసీవర్ని పెట్టేసింది.

సావిత్రి రిసీవర్ని పెట్టేసి మళ్ళా సోఫాలో కూర్చుంది.

ఆమె ఎవరు? తన భర్త ఆమెకు ఎందుకు కావాలి? ఆమె పేరు తను అడిగి కనుక్కోవలసింది. అదంతా అడగనందుకు ఆమె లోలోపల విచారించింది.

వంటామె రావడంతో సావిత్రి టెలిఫోన్ చేసిన యువతి గురించి మర్చిపోయింది.

"అమ్మా, లంచ్‌కి ఏం చేయమంటారు?" అడిగింది వంటామె.

ఆమె నవ్వుతూ వంటామెవైపు చూసింది.

"ఇవాళ నా ఫ్రెండ్స్ భోజనానికి వస్తారు. మొత్తం నలుగురు వుంటారు. మైసూర్‌పాక్ చేయండి. రెండు కూరలు, సాంబార్, అప్పడాలు అన్నీ చేయాలి" అందామె.

"అలాగేనమ్మా" అని వంటామె వినయంగా లోపలకు వెళ్ళిపోయింది.

మళ్ళా టెలిఫోన్ మ్రోగింది.

"హలో" అందామె.

"నేనే, జయంతి" అందో కంఠం అటువైపునించి.

"ఎప్పుడొస్తున్నావు?"

"నలుగురం కలిసి వస్తాం. గిరిజ, రమా, మనోరమ యిక్కడికొస్తానన్నారు."

"గుడ్, మరీ ఆలస్యం చేయకండి. మనం యెంతో మాట్లాడుకోవాలి" అందామె.

"అక్కడికి రావాలని మాకూ ఎంతగానో వుందిలే! తొందరగా వస్తాం" అంది జయంతి.

2

రోడ్డమ్మట కారు వేగంగా కదుల్తోంది.

"రాజూ, హోటల్ నటరాజ్ ముందు కారు ఆపు!"

అన్నాడు నాగేశ్వరరావు.

"అలాగే సార్" అన్నాడు డ్రయివరు.

జేబులోంచి వందరూపాయిల నోటు తీసి అతను డ్రయివర్ కిచ్చాడు.

"నీకు కూతురు పుట్టిందని చెప్పావుగా, ఆ డబ్బుతో ఆమెకేదేనా కొను. మరో విషయం. హోటల్ నటరాజ్ ముందు ఒక యువతి యీ కారులో ఎక్కి, నాతో బెంగుళూరు వస్తుంది. ఆమెను గురించి అమ్మగారితో ఏమీ చెప్పకు!" అన్నాడతను.

"ప్రాణం పోయినా చెప్పను, సార్" అన్నాడు డ్రయివర్.

హోటల్ నటరాజ్ ముందు రోడ్డు వారగా కారు ఆగింది. పేవ్ మెంటుమీద నిలబడి వున్న ఒక యువతి హేండ్ బాగ్, ఏర్ బాగ్ పట్టుకుని కారువైపు వచ్చింది. నాగేశ్వరరావు తలుపు తెరిచి ఆమెను తన పక్కనే కూర్చోమన్నాడు.

ఏర్ బాగ్ ను డ్రయివర్ ముందు సీటుమీద పెట్టాడు. నవ్వుతూ ఆమె వెనుక సీటుమీద కూర్చుంది. నాగేశ్వర రావు తలుపు మూశాడు.

డ్రయివర్ కారును పోనిచ్చాడు.

నాగేశ్వరరావు పక్క కూర్చున్న ఆమెవంక ఆత్రంగా చూశాడు. మెల్లిగా ఆమె చెయ్యి పట్టుకున్నాడు. సిగ్గు పడ్తూ ఆమె అతడివైపు చూసింది.

అతడి కళ్ళు ఆమెమీద కేంద్రీకృత మయినాయి. ఆమె చాలా అందంగా వుంది. పొడుగ్గా, పచ్చగావుంది. పెద్ద కళ్ళు జోతుల్లా వెలుతున్నాయి. ఎర్రటి పెదిమలు. తీర్చిదిద్దిన ముక్కు. పొడుగాటి జడ.

ఆమె వయస్సు 26 పైన వుండొచ్చు. ఆమె ధరించిన దుస్తులు అంత ఖరీదైనవి కావు. కాని ఏ దుస్తుల్లోనైనా ఆమె అందంగానే వుంటుంది.

"భామా, నీ కేసి చూస్తూ యిలా యెన్ని సంవత్స రాలైనా వుండిపోగలను!"

"థాంక్ గాడ్ యుగాలు అనలేదు!" అందామె.

కారు స్పీడుగా దూసుకుపోతోంది. ట్రంక్ రోడ్డుకి యిటూ అటూ చింత చెట్లు వున్నాయి.

"నిన్ను నాతో బెంగుళూరు ఎందుకు రమ్మన్నానో తెలుసా?"

"తెలియదు."

"అక్కడ చక్కటి హోటల్లో మనం వుండొచ్చు. కావలసినంత ప్రయివసీ."

"మనకు ప్రయివసీ ఎందుకు?" అందామె ఓరగా అతడివైపు చూస్తూ.

అతడామె కళ్ళలోకి సూటిగా చూశాడు.

"భామా, నువ్వు బి.ఎ. పాసయ్యావు. కాని నీ మెదడు యింకా పెరగలేదు."

గంట ప్రయాణం చేసి ఒక చెట్టుకింద కారు ఆగింది. డ్రయివర్ దూరంగా వెళ్ళిపోయాడు. ప్లాస్టిక్ బుట్ట వున్న కేరియర్ని పైకితీసి అతడు తెర్చాడు. ఇడ్లీలను రెండు ప్లేటల్లో పెట్టి, చట్నీ వేసి ఆమెకో ప్లేటు యిచ్చాడు. మరో ప్లేటు తను తీసుకున్నాడు.

"లెటస్ యీట్! నీలాంటి అందమైన యువతి పక్క నున్నప్పుడు నాకు చాలా ఆకలిగా వుంటుంది" అన్నా డతను.

"ఇడ్లీ చాలా బాగుంది. మీ భార్య చాలా బాగా

చేసారు" అందామె.

"ఈ యిడ్లీలో ఏదేనా రుచివుంటే అందుకు క్రెడిట్ మా వంటామె కివ్వాలి, నా భార్యకు కాదు. మా వంటామె పదార్థాలన్నీ చాలా బాగా చేస్తుంది" అన్నాడతను.

దూరంలో చింతచెట్టుకింద నిలబడిన డ్రయివర్ వైపు ఆమె చూసింది.

"పాపం, డ్రయివర్ని మనం మర్చిపోయాం."

"ఆ మాట అన్నందుకు అతడు చాలా సంతోషిస్తాడు" అని అతడు హారన్ నొక్కాడు.

డ్రయివర్ పరిగెత్తుకొచ్చాడు. అరిటాకులో ఇడ్లీ వేసిచ్చి, నాగేశ్వరరావు అతడివైపు నవ్వుతూ చూశాడు.

"మొహమాట పడకు! కావలసినన్ని ఇడ్లీ లున్నాయి. తర్వాత హాట్ కాఫీ!"

"అలాగే సార్" అని డ్రయివర్ దూరంగా కదిలాడు.

తర్వాత యిద్దరూ హాట్ కాఫీ తాగారు. అతడు గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ వెలిగించాడు. పొగ వదుల్తూ ఆమె వైపు చూశాడు.

"భామా, ఐ లవ్ యూ!"

ఆమె వ్యంగ్యంగా నవ్వింది.

"ఎందుకలా నవ్వుతున్నావు?" అడిగాడతను.

"మీకు భార్య వుంది. ఫలించదని తెలిసినా మీరు నన్ను ప్రేమిస్తున్నారు. నేనలా ప్రేమించలేను" అందామె.

అతడామె చెయ్యి పట్టుకున్నాడు. మెల్లిగా నిమిరాడు.

"భామా నిన్ను నేను పెళ్ళాడతాను. మన ప్రేమకు

నా భార్య అడ్డురాదు, రానివ్వను" అన్నాడతను వుద్రేకంతో.

"భార్య వుండగా మళ్ళీ పెళ్ళా?"

"భామా, నా భార్యకు విడాకులు యిచ్చేస్తాను. అటుపైన నిన్ను పెళ్ళాడ్తాను."

"అదంతా జరిగాక చూద్దాం" అందామె.

"నా గురించి నీకింకా బాగా తెలియదు. నేను చెయ్యదల్చినది చేస్తాను."

"మంచిది" అందామె క్లుప్తంగా.

3

హోటల్ గదిలోని సోఫాలో కూర్చుని అతడు విస్కీ సేవిస్తున్నాడు. ఆమె మంచంమీద పడుకుని ఆలోచిస్తోంది.

లారీ ఆఫీసులో గుమస్తాగా పనిచేసి ఆమె తండ్రి రిటైరయ్యాడు. సమీపంలో వున్న సేట్ జీ బట్టల షాపులో గుమస్తాగా చేరాడు. నలుగురు కుమార్తెలకు అతను పెళ్ళిళ్ళు చేశాడు. కాని సత్యభామ పెళ్ళిచేయడానికి అతడి దగ్గర డబ్బులేదు. ఆమె కాలేజీలో చేరి బి.ఎ. పాసయింది.

తండ్రికొచ్చే జీతం యింటికి చాలదని గ్రహించి ఆమె నాగేశ్వరరావు నిటింగ్ ఫాక్టరీలో అసిస్టెంట్ గా చేరింది.

మొదటిసారి ఆమెను చూసినప్పుడు ఆమె అందం అతడిని విశేషంగా ఆకర్షించింది. అది ఆమె గ్రహించింది. పేదరికంలో పెరిగిన ఆమెకు అతడొక పెన్నిధిలా అగుపించాడు. అతడికి పెళ్ళయిందని ఆమెకు తెలుసు కాని అతడిని తన చేతిలో వుంచుకుంటే ఏదో విధంగా

లాభిస్తుందని భావించి ఆమె అతడిని హద్దుల్లో ప్రోత్సహించేది.

గ్లాసులోని విస్కీని నాగేశ్వరరావు పూర్తిగా తాగేసి ఆమెవైపు చూశాడు. పరుపుమీద ఆమె బంగారం బొమ్మలా పడుకుని వుంది.

ఆ రోజల్లా వాళ్ళిద్దరూ కారులో అనేకచోట్లకు తిరిగారు. అతడామెకు రెండు మైసూర్ సిల్కు చీరలు కొన్నాడు. ఖరీదైన నగలు కొనిచ్చాడు.

సోఫాలోంచి లేచి అతడు ఆమె మంచంవైపు వెళ్ళాడు. పక్కనే కూర్చుని ఆమె పాదంమీద చెయ్యి వేశాడు. చిన్నపాదం! బంగారం ముద్దలా వుంది.

కళ్ళు తెర్చి ఆమె అతడివంక చూసింది. తీయగా నవ్వింది.

“భామా పదవుతోంది. డిన్నర్ గదికి తెప్పించనా?” ప్రశ్నించాడతను.

“నాకు ఆకలిగాలేదు. రోజల్లా తింటూనే వున్నాం.”

“కొంచెం తిను” అన్నాడతను.

కునికిపాట్లు పడ్తూ ఆమె ఆవులించింది.

“నిద్ర వస్తోంది. తొందరగా తెమ్మనండి. పడుకోవాలి!” అందామె.

అతడు ఫోన్‌లో మాట్లాడి, డిన్నర్ గదికి పంపమన్నాడు. నవ్వుతూ వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. గ్లాసులో విస్కీపోసి సోడా కలిపాడు. డిన్నర్ ముందు మరో పెగ్ సేవించాలి!

కొంచెం విస్కీ తాగి అతడు ఆమెవైపు చూశాడు.

“భామా, యిలా వచ్చి కూర్చో! డిన్నర్ వస్తోంది” అన్నాడతను.

ఆమె లేచింది. వయ్యారంగా నడిచి సోఫాలో అతడి పక్కనే కూర్చుంది.

ఎడంవైపుకు వంగి అతడామె పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"విస్కీ వాసన!" అందామె.

గ్లాసును టీపాయిమీద వుంచి అతడామెను బలంగా కౌగలించుకున్నాడు. మళ్ళా ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

అమాంతంగా ఆమె సోఫాలోంచి లేచింది.

"మీ దగ్గర కూర్చోడానికి భయంగా వుంది" అందామె నవ్వుతూ.

అతడామెవైపు ఆత్రంగా చూశాడు.

"భామా, ఐ లవ్ యూ" అన్నాడతను.

ఎవరో తలుపు తట్టారు. ఆమె వెళ్ళి తలుపు తెర్చింది. హోటల్ బాయ్ పెద్ద ట్రేతో లోపలకు వచ్చాడు. ట్రేని టీపాయ్‌మీద వుంచి వాళ్ళవైపు చూశాడు.

"రేపు పొద్దుట ప్లేట్లు పట్టుకెళ్ళొచ్చు. రాత్రి రావద్దు" అన్నాడు నాగేశ్వరరావు.

"అలాగే, సార్" అని బాయ్ వెళ్ళిపోయాడు.

సత్యభామ తలుపుమూసి లాక్ చేసింది. ఉషారుగా నడిచి అతడి కెదురుగా వున్న సోఫాలో కూర్చుంది.

"లెటస్ స్టార్ట్ యీటింగ్" అందామె.

"నువ్వు తిను. నేను డ్రింక్ అయ్యాక తింటాను" అన్నాడతను.

ఇద్దరు డిన్నర్ ముగించారు. ఆమె పరుపుమీద పడుకుంది. జీరోవాట్ బల్బు గదిలో డిమ్‌గా వెలుగుతోంది.

అతడు మెల్లిగా ఆమె పక్కన పడుకున్నాడు.

నిమిషాలు గడుస్తున్నాయి. ఆమెమీద అతను చెయ్యి వేశాడు.

"భామా, యిటు తిరుగు!"

ఆమె అతడివైపు తిరిగింది. ఆమె గడ్డాన్ని వేళ్ళతో నిమిరాడతను.

ఆమె తీయగా నవ్వింది. ఎర్రటి ఆమె పెదిమలను అతడు ముద్దెట్టుకున్నాడు.

"ప్లీస్, చాలు, నన్ను పడుకోనివ్వండి!" అందామె.

అతడు పరిహాసంగా నవ్వాడు.

"భామా, నిద్రపోడానికి యింత దూరం రావాలా?"

"మరేం చేయడానికి రావాలి?" అడిగిందామె.

"భామా, నన్ను నమ్ము. నీకు నేను ద్రోహం చెయ్యను. డైవర్సుకు అప్లయిచేసి, అది వచ్చాక నిన్ను నేను పెళ్ళాడ్తాను. ఏదీ తెలియని వయసులో నా పెళ్ళి జరిగి పోయింది. నిన్ను చూశాక ప్రేమ నా హృదయంలో జ్యోతిలా వెలగడం మొదలెట్టింది. నువ్వు లేకుండా నేను బతకలేను."

"నేను ఎక్కడికీ పోను. నా యింట్లోనే వుంటాను. మీ ఫాక్టరీలో పనిచేస్తూనే వుంటాను" అందామె అతడి మెడను నిమురుతూ.

"భామా, నీ జీవితాంతం ఏమవుతుందో అని నువ్వు భయపడవలసిన అవుసరంలేదు. నీకు ఏ ఆపదా రాకుండా నేను చూస్తాను."

అతడు ఆమెమీద వాలాడు. ఆమెను బలంగా ముద్దెట్టుకున్నాడు. అమాంతంగా ఆమె లేచి కూర్చుంది.

"చూడండి, మీ ప్రేమను చూసి నేను చాలా ఆనందిస్తున్నాను. కాని పెళ్ళిముందు కోర్కెలను తీర్చుకోడం

నాకు నచ్చను. నన్ను బలాత్కరించడానికి ప్రయత్నించ కండి. అలా మీరు చేస్తే ఈ గదిలోంచి నేను బయటకు పోతాను" అందామె.

అతడామె చెయ్యిని ఆప్యాయంగా పట్టుకున్నాడు.

"భామా, ప్రేమించిన యువతిని బలాత్కరించడమా? అలా అనకు. నేను భరించలేను."

"నా తలిదండ్రులు వృద్ధులయిపోయారు. నేనంటే వాళ్ళకెంతో ప్రేమ. నాకేదేనా అయితే వాళ్ళిద్దరూ ఏ నూతిలోనో పడి చస్తారు. అందువలన మనం జాగ్రత్త పడ్డం మంచిది. మీకోసం నేను ఎంతకాలమైనా వేచి వుండగలను. మీరు అన్నట్లు డైవర్సు వచ్చాక మనం పెళ్ళిచేసుకుందాం. అంతవరకూ మీ కోర్కెలను అదుపులో వుంచుకోండి" అందామె.

"భామా, నువ్వు చెప్పినట్లే చేద్దాం. తొందరపడి నందుకు నన్ను క్షమించు" అన్నాడు నాగేశ్వరరావు.

4

సావిత్రి పడగ్గదిలోకి వెళ్ళి బీరువా తెర్చి చూసింది. యాభై రూపాయిల నోట్లు వున్నాయి. తనకు ఐదు రూపాయిలు కావాలి!

పడగ్గదిలో భర్త లేడు. బాత్ రూమ్‌లో అతను వుండి వుండాలి. కోటు లోపల జేబులో వున్న పర్సును ఆమె తీసింది.

పర్సును చూస్తూ ఆమె క్షణకాలం అలాగే వుండి పోయింది. పర్సులో పెట్టిన ఒక యువతి ఫోటో నవ్వుతూ ఆమెవైపు చూస్తోంది. ఫోటో కింద "విత్ లవ్, సత్య భామ" అని రాసివుంది. ఎవరీ సత్యభామ? ఆమె ఫోటో తన భర్త పర్సులో ఎందుకుంది?

పర్సులోంచి ఐదురూపాయిల నోటు తీసుకుని ఆమె బయటకు వెళ్ళిపోయింది. కాస్సేపట్లో గదిలోకి తిరిగి వచ్చింది.

భర్త దుస్తులు ధరిస్తున్నాడు. ఆమెవైపు అతడు నవ్వుతూ చూశాడు.

"మీ పర్సులోంచి ఐదురూపాయిలనోటు తీసుకుని నౌఖరుకిచ్చాను" అందామె.

"నాతో చెప్పడం దేనికి?" అని అతడు ఆమెకంక సూటిగా చూశాడు.

"సావిత్రీ, పర్సులో వున్న యువతి ఫోటో చూశావా?" ప్రశ్నించాడతను.

"చూశాను" అందామె.

"ఆమె ఎలా వుంది?"

"చాలా అందంగా వుంది. ఎవరామె?"

అతడు నవ్వుతూ ఆమె దగ్గరకు జరిగాడు.

"ఆమెను పెళ్ళిచేసుకోవచ్చంటావా?"

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"నా మిత్రుడు కేశవ్ ఆ ఫోటో నాకు పంపాడు. ఆ అమ్మాయిని అతడు పెళ్ళాడబోతున్నాడట."

"తప్పక చేసుకోమనండి. పిల్ల బాగుంది."

"అతడికి రాస్తాను."

అతడివైపు చూస్తూ ఆమె భుజంమీద చెయ్యివేసింది.

"ఆ ఫోటో మీ పర్సులో వుండడం నాకిష్టంలేదు!" అందామె.

"ఇవాళ కేశవ్‌కి పంపించేస్తాను" అన్నాడతను నవ్వుతూ.

భర్త అలా అన్నా ఆమెలో తలెత్తిన అనుమానం

పూర్తిగా తొలగిపోలేదు. కేశవ్ ఎవరు?

"మీ మిత్రుడు కేశవ్ ఎక్కడుంటున్నాడు?"

"మద్రాసులోనే. ప్రియా రబ్బర్ ఫాక్టరీలో పని చేస్తున్నాడు. పెళ్ళికి మనం వెళ్లాలి" అన్నాడతను.

"ఎప్పుడు పెళ్ళి?"

"ఇప్పుడే కాదులే. అతడి చెల్లెల్కి పెళ్ళయినాక అతడు పెళ్ళి చేసుకుంటానన్నాడు."

"మీ మిత్రుడు గొప్ప హృదయం కలవాడు. ఆమె పెళ్ళి త్వరగా అవాలని దేవుడికి ప్రార్థించుదాం" అందామె.

5

నాగేశ్వరరావు తన రొటేటింగ్ కుర్చీలో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

తన పెళ్ళయి ఆరేళ్ళు దాటింది. తన భార్య సావిత్రి ఎక్కువగా మాట్లాడదు. నిండు కుండలా తొణకదు. ఆమె మెదడులో ఏ ఆలోచనలు సాగుతున్నాయో కను క్కోడం కష్టం.

తను అనుభవించే ఆస్తంతా యిప్పుడు ఆమె పేరనే వుంది. ఆమె ఏ మాత్రం అనుమానించినా తనకు యెదురు తిరగొచ్చు!

ఫోన్ చేసి అతడు సత్యభామను తన గదికి రమ్మ న్నాడు.

నవ్వుతూ ఆమె అతడి ఏర్ కండిషండ్ గదిలోకి వచ్చింది. ఖరీదు తక్కువయినా ఆమె ధరించిన కాటన్ చీర, జాకెట్టు యింపుగా వున్నాయి. చెవులకు దుద్దులు, మెళ్లో సన్నటి గొలుసు మాత్రం వున్నాయి.

ఆమె అతడి టేబుల్ పక్కనే నిలబడింది.

"భామా!" పిల్చాడతను.

ఆమె నవ్వింది.

"ఇలా నా ఒళ్ళో కూర్చో!"

"అదంతా యిప్పుడు వద్దని చెప్పానుగా!"

"కూర్చుంటే ఏమైపోతుంది? ఎప్పుడో అప్పుడు నువ్వు ఎలాగైనా నాకు లొంగవలసిందే."

"ఆ సమయం వచ్చాక చూద్దాం."

"భామా, డైవర్సు కేసు పూర్తవడానికి కొంత టైము పడుతుంది. రాత్రి ఆలోచించి నేను ఒక నిశ్చయానికి వచ్చాను."

"ఏమిటో చెప్పండి."

"మనిద్దరం రహస్యంగా దేవాలయంలో పెళ్ళిచేసుకుందాం. నీకోసం ప్రత్యేకంగా నేనొక యిల్లు తీసుకుంటాను. మనం సుఖంగా జీవించవచ్చు!"

"భార్య వుండగా మీరు నన్ను పెళ్ళాడ్డం ఇల్లీగల్! అటువంటి చర్యలు నాకు నచ్చవు."

అతడామె చెయ్యి పట్టుకుని తనవైపు లాగాడు. అతడి మీదపడి ఆమె లేచి పక్కకు కదిలింది.

"ఎవరేనా గదిలోకొస్తే చూస్తారు. వాగుతారు. యిక్కడ పనిచేసేవాళ్ళు మనల్ని గురించి మాట్లాడ్డం నాకిష్టంలేదు."

"నేను రమ్మంటేగాని యీ గదిలోకి యెవ్వరూ రారు!" అన్నాడతను.

"అకౌంటెంట్ యెన్నిసార్లో లోపలకు రావడం నేను చూశాను."

"అతనా, ఓల్డు ఫెలో! అతను ఏదేనా చూసినా ఎక్కడా వాగడు. అరవై ఏళ్ళు దాటినా నేను అతడిని

ఉద్యోగంలో వుండనిచ్చాను."

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది.

"బెంగుళూరులో మనకెంతో ప్రయివసీ వుండి. కాని అక్కడ ఏం చేయగలిగాం? మనం వాదించి లాభంలేదు. మొదట మీరు మీ యిల్లు సర్దుకోండి. రావలసిన సమయంలో మీ భార్యగా నేను అక్కడికొస్తాను" అందామె.

అతడివైపు తిరిగి చూడకుండా ఆమె బయటకి వెళ్ళిపోయింది.

ఆమెవైపే చూస్తూ అతడు వుండిపోయాడు. ఆమెను చూస్తూంటే అతిడిలోని వాంఛ పెరుగుతోంది.

స్ప్రింగ్ తలుపు మూసుకుపోయింది—అతడు సిగరెట్ వెలిగించి, పొగవదులుతూ కుర్చీలో వెనక్కి వాలాడు.

ఏదో ఆలోచనతట్టి టేబుల్ మీదున్న పెర్సనల్ ఫోన్ రిసీవర్ ఎత్తి అతడు ఒక నంబరు తిప్పాడు.

"హాలో!" అదొక స్త్రీ కంఠం.

"సావిత్రీ, ఇప్పుడే కాశ్మీర్ ఏజంటు వచ్చి వెళ్లాడు. మన్ని కాశ్మీర్ రమ్మన్నాడు. పదిహేను రోజులపాటు స్వర్గంలో వుంటాం. వెళ్దామా?"

"ఇప్పుడెందుకంత దూరం? అక్కడ ఏవో అల్లరు జరుగుతున్నాయని పేపర్లో చూశాను" అందామె.

"అల్లరు ఎప్పుడూ వుంటాయి, సావిత్రీ! మనం వుండే హోటల్లో మన అల్లరే వుంటుంది."

"ఇంటికొచ్చాక మాట్లాడుదాం."

"నువ్వు వస్తానంటే కాశ్మీర్ ఏజంటుతో చెప్పి మనకు కావలసినవన్నీ అరేంజి చేయమంటాను."

"ఆల్ రైట్, వెళ్దాం."

"చాలా సంతోషం. ఈ ఫాక్టరీ పనులతో నీకు

నా అటెన్షన్ యివ్వలేకపోతున్నాను. కాశ్మీర్‌లో పదిహేనురోజులు మనం హాయిగా గడపొచ్చు. వుంటాను" అని అతడు రిసీవర్ పెట్టేశాడు.

6

కారును తనే స్వయంగా నడుపుతూ నాగేశ్వరరావు ఎక్కడికో వెళ్ళాడు.

సావిత్రి వరండామీదకు వెళ్ళి రాజును పిల్చింది. డ్రయివరు రాజు వినయంగా దగ్గరకొచ్చాడు.

"రాజూ, మేడమీదకురా! నీతో మాట్లాడాలి" అందామె.

"అలాగేనమ్మా."

ఆమె పైకి వెళ్ళిపోయింది. మేడ మీద ముందు వరండాలో సోఫాలో ఆమె కూర్చుంది. రాజు వచ్చి సమీపంలో నిలబడ్డాడు.

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది.

"రాజూ నాకు కొంత సమాచారం కావాలి."

"నే నేం చెప్పగలనమ్మా!"

"నువ్వు అయ్యగారికూడా వుంటూ వుంటావు. జరిగే దంతా చూస్తూ వుంటావు. సత్యభామ ఎవరు?"

"నాకు తెలీదమ్మా. ఆ పేరు నేనెప్పుడూ విన లేదు."

హేండ్ బాగ్ తెరిచి రెండువందల రూపాయిల నోట్లు తీసి ఆమె అతడికిచ్చింది.

"రాజూ, ఇంకా నీకిస్తాను. సత్యభామ ఎవరో చెప్ప గలవా?"

"నేను చెప్పానని తెలిస్తే అయ్యగారు నన్ను పొమ్మంటారు."

అతడివైపు ఆమె నవ్వుతూ చూసింది.

"నువ్వు చెప్పినట్లు నేను చెప్పను. నన్ను నమ్ము. ఈ ఆస్తంతా నాది, అయ్యగారిది కాదు. ఆయన నిన్ను పొమ్మంటే నేను నీకు ఉద్యోగం యిస్తాను" అందామె.

"సత్యభామ అనే అమ్మాయి ఫాక్టరీలో పని చేస్తోందమ్మా. అయ్యగారు ఆమెతో కారులో బెంగుళూరు కూడా వెళ్ళారు" అన్నాడతను.

"వాళ్ళు బెంగుళూరులో ఎక్కడున్నారు?"

"ఫెయిరీలాండ్ హోటల్లో, రూమ్ నంబరు 20."

"ఆమెతో ఆయన యింకా ఎక్కడెక్కడికెళ్ళారు?"

"మైసూరు వెళ్ళారు. బెంగుళూరులో ఆమెకు నగలు, చీరలు కొని యిచ్చారు."

"వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటున్నారంటావా?"

"అది నేను చెప్పలేనమ్మా. ఆమె బీదపిల్లలా నాకు కనిపించింది. డబ్బుకోసం ఆయన వెంటపడి వుండాలి. అయ్యగారికి ఆమె అంటే మహా మోజమ్మా" అన్నాడతను.

"ఆమె అందంగా వుంటుందా?"

"చాలా అందంగా వుంటుందమ్మా."

కాసేపు ఆమె ఆలోచిస్తూ వుండిపోయింది. తన కళ్లు కప్పడానికి సత్యభామని తన మిత్రుడు కేశవ్ పెళ్ళాడబోతున్నాడని భర్త ఆమెతో చెప్పాడు. కేశవ్ అనే మిత్రుడు తన భర్తకున్నాడా?

"రాజా, అయ్యగారి మిత్రుడు కేశవ్ నీకు తెలుసా?"

అతడు మౌనంగా వుండిపోయాడు.

"ఆ పేరుతో ఎవరూ లేరమ్మా."

"ప్రియా రబ్బరు ఫాక్టరీలో పనిచేస్తున్నాడట."

"ఆయన పేరు రామ్మూర్తిగారమ్మా. ఆయన ఇంట్లో పెళ్ళికావలసిన చెల్లెలు కూడా వుంది" అన్నాడు డ్రయివర్.

అబద్ధాలాడేటప్పుడు మనకు తెలియకుండానే కొంత నిజం బయటకు దొర్లుతూ వుంటుంది, అనుకుంది సావిత్రి లోలోపల.

మరో రెండువందల రూపాయిల నోట్లు తీసి ఆమె డ్రయివర్ చేతిలో పెట్టింది.

"రాజూ, ఇవాళనుంచి నువ్వు అయ్యగార్ని, సత్యభామనూ రహస్యంగా గమనిస్తూ వుండు. అయ్యగారితో ఆమెకు సంబంధం వుందా, లేక ఆమె వూరికే తిరుగుతోందా? అంతా తెల్సుకుని నాకు చెప్పాలి. సత్యభామ ఎక్కడ వుంటుందో? ఆమె యింట్లో ఎవరెవరున్నారు, అన్నీ నాకు కావాలి."

"తెల్సుకుని చెప్తానమ్మా."

"నీ సేవకు పారితోషికం యిస్తూనే వుంటాను" అందామె.

"మీ చెయ్యి పెద్దదమ్మా, నాకు తెలియనిదా!" అని డ్రయివర్ రాజు వెళ్ళిపోయాడు.

గోరంత అనుమానం యిప్పుడు కొండంత రూపం దాల్చింది. సావిత్రి ఆలోచిస్తూ కూర్చుంది.

భర్త తనను కాశ్మీర్ రమ్మనడం విచిత్రంగా వుంది. సత్యభామకు బదులు తనని భర్త కాశ్మీర్‌కు ఎందుకు తీసుకెళ్ళాలనుకుంటున్నాడు? తను జాగ్రత్తపడాలి! ఆలోచిస్తూ ఆమె సోఫాలోంచి లేచి లోపలకు వెళ్ళింది.

7

విమానంలో నాగేశ్వరరావు, సావిత్రి ఢిల్లీ వెళ్లారు. అక్కడనుంచి విమానంలో శ్రీనగర్ చేరుకున్నారు.

రవూఫ్ అబ్దుల్లా వాళ్ళకు స్వాగతం యిచ్చాడు. నాగేశ్వరరావు నవ్వుతూ తన భార్యను అతడికి పరిచయం చేశాడు.

"అబ్దుల్లా మన ఏజంటు. మనం తయారుచేసే బనియన్లు, టీ షర్టులు వగైరా యిక్కడ పంపిణీ చేస్తాడు" అన్నాడతను సావిత్రితో.

ఆమె నవ్వుతూ అబ్దుల్లాకు నమస్కరించింది. ముగ్గురూ కారులో కూర్చున్నారు. డ్రయివర్ కారును పోనిచ్చాడు.

ఒబరాయి హోటల్‌కి వాళ్ళు చేరుకున్నారు. వాళ్ళకు రిజర్వు చేసిన 50 నంబరు గది చాలా బాగుంది.

సావిత్రి బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది. నాగేశ్వరరావు అబ్దుల్లా వైపు నవ్వుతూ చూశాడు.

"గత ఐదేళ్ళగా మీ డిస్ట్రిబ్యూషన్ ఒకేలావుంది. మీరు పాటుపడి అమ్మకాన్ని పెంచాలి" అన్నాడతను.

"హోల్సైలులో కాంపిటీషన్ ఎక్కువగా వుంది. తిరుపూర్ నుంచి అనేక కంపెనీల సరుకు మార్కెట్‌లో చాలా చౌకగా అమ్మేస్తున్నారు" అన్నాడు అబ్దుల్లా.

"తతిమ్మాచోట్ల మా సేల్సు యెక్కువయినాయి. కాశ్మీర్‌లో మాత్రం పెరగకుండా వున్నాయి" అన్నాడు నాగేశ్వరరావు.

"మీరు వర్రీ అవకండి. ఎక్కువగా అమ్మితే మాకూ లాభిస్తుందిగా. అమ్మడానికి ప్రయత్నిస్తాం."

"గుడ్. మేం యిక్కడ వున్నంతకాలం మాకొక కారు కావాలి."

"రావు సాబ్, మనం యిక్కడికొచ్చిన ఫియట్ కారు మీరు వుంచుకోండి. డ్రయివర్ చాలా అనుభవం కలవాడు."

"థాంక్స్" అన్నాడు నాగేశ్వరరావు.

సావిత్రి వచ్చి సోఫాలో కూర్చుంది. ఆమె భర్త బాత్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు.

"మిష్టర్ అబ్దుల్లా, కాశ్మీర్ నిజంగా స్వర్గంలాగే వుంది. ఈమధ్య మీరు మద్రాసు వచ్చారుగా...."

"నేను రాలేదు" అన్నాడతను అడ్డొస్తూ.

"మీ కంపెనీనుంచి మరెవరైనా వచ్చారేమో!"

"నేను ఎవర్నీ మద్రాస్ పంపలేదు!"

"నేను పొరబడి వుంటాను" అందామె, బాత్‌రూమ్ తలుపు తెరవడం గమనిస్తూ.

"కాశ్మీర్ రాడానికి యిది సరైన సమయం" అన్నాడు అబ్దుల్లా.

"అందుకే వచ్చాం. మాకు తెలిసిన మీలాంటి మిత్రులు యిక్కడ వుండడం మా అదృష్టం" అందామె.

"అన్నీ చూపించడానికి కావలిస్తే ఒక మనిషిని నేను మీతో పంపగలను" అన్నాడతను.

"డోంట్ బాదర్! నేనింతకుముందు కాశ్మీర్‌కు చాలాసార్లు వచ్చాను" అన్నాడు నాగేశ్వరరావు.

అబ్దుల్లా సోఫాలోంచి లేచాడు. వాళ్ళిద్దరివైపూ చూశాడు.

"ఏదేనా కావలిస్తే నాకు టెలిఫోన్ చేయండి" అని చెప్పి అతడు వెళ్ళిపోయాడు.

నాగేశ్వరరావు అతడితో బయటకు వెళ్ళాడు. సావిత్రి ఆలోచిస్తూ తెర్చి వున్న గుమ్మంవైపు నడిచింది.

తన భర్త తనతో అబద్ధం చెప్పాడు. కాశ్మీర్ ఏజంటు మద్రాసు వచ్చాడన్నాడు. అదంతా కల్పితం. తన భర్త తనని యింతదూరం ఎందుకు తీసుకొచ్చాడు?

ఆమె ఆలోచిస్తూ నడవమ్మట చూసింది. ఒకతను వేగంగా నడిచివస్తున్నాడు. ఆమె ముందునుంచి అతను మెల్లిగా కదిలాడు.

ఆమెను చూసి అతడు క్షణకాలం ఆగాడు. "ఫైన్ కాశ్మీర్!" అని అతడు వెళ్ళిపోయాడు.

పక్కగది తాళంతీసి లోపలకు వెళ్ళాడు. తనలో తను నవ్వుకుంటూ ఆమె గదిలోకి వచ్చేసింది.

బాత్‌రూంలోకి వెళ్ళి మొహం కడుక్కుంది. మొహాన్ని తుడుచుకుని సోఫాలో కూర్చుంది. గదిలో ఫాన్ తిరుగుతోంది. ఆమె మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. సత్యభామ కూడా తనకు తెలియకుండా కాశ్మీర్ వచ్చిందేమో! ఆమె మరో హోటల్లో వుంటోందేమో!

"హలో, డార్లింగ్ అలా తిరిగొద్దాం పద!" అన్నాడు నాగేశ్వరరావు.

8

ఎనిమిదింటిల్లా అతడు హుషారుగా ఆమెను లేపాడు.

"సావిత్రీ, లే వెళ్ళాలి" అన్నాడతను.

"ఎక్కడకు?" అందామె.

"పదికిలోమీటర్ల దూరంలో ఏదో సరస్సు వుందిట."

"డాల్ లేకా?"

"కాదు. ఈ లేక్‌లో మనం స్నానం చేయొచ్చు. హాయిగా వుంటుంది."

కాస్సేపట్లో యిద్దరూ తయారయ్యారు. తలుపుమూసి

లాక్ చేశారు. ఏర్ బాగ్ అతడి చేతిలో వుంది.

నడవమ్మట యిద్దరూ నడిచి వెళ్ళారు. హోటల్ లోంచి బయటకు నడిచారు. ఫియట్ కారు డ్రయివర్ అహమద్ వాళ్ళకు సలామ్ చేశాడు.

"అహమ్మద్, కారులో మేమిద్దరం వెళ్తాం. నువ్వు రానవసరంలేదు" అన్నాడు నాగేశ్వరరావు.

"అతడు కూడా రావడం మంచిది" అందామె.

"సావిత్రీ, మనిద్దరిమధ్యా పానకంలో పుడకలా వీడెందుకు? మరో మనిషి కారులో వుంటే మనకు ప్రయివసీ వుండదు."

"మీ యిష్టం" అందామె.

ముందు సీటుమీద సావిత్రి కూర్చుంది. ఇగ్నిషన్ కీ తీసుకుని అతడు ఎక్కాడు.

ఏదేనా కొనుక్కోమని డ్రయివరు చేతిలో అతడు పదిరూపాయిలనోటు పెట్టాడు.

నాగేశ్వరరావు కారును పోనిచ్చాడు. రోడ్డు యిరువైపులా సావిత్రి చూస్తోంది. ప్రకృతి సౌందర్యం బ్రహ్మాండంగా వుంది. రంగురంగుల పూలమొక్కలు. చెట్లనుంచి యాపిల్ పళ్ళు వేళ్ళాడుతున్నాయి.

అరగంట పైన రోడ్డమ్మట కారు ప్రయాణంచేస్తోంది. తన నరాలు బిగుసుకుపోయినట్లు అతడు కూర్చున్నాడు. ఎక్కడా జనసంచారంలేదు.

అతరు కారును ఆపాడు. ఆమె నలువైపులాచూసింది. ఎక్కడా చెరువులేదు.

"మీరు చెప్పిన లేక్ యిక్కడ లేదే?" అందామె.

అతడు కిందకు దిగాడు. కుడివైపున రాళ్ళగుట్ట ఎత్తుగా కనిపిస్తోంది.

"ఆ గుట్టపైకి వెళ్దాం. అక్కడనుంచి నలువైపులా చూడొచ్చు. వ్యూ బాగుంటుంది."

"నాకు భయం! కళ్ళు తిరుగుతాయి!" అందామె.

"పక్కన నేనున్నానుగా!" అన్నాడతను.

ఆమె కిందకు దిగింది. కారు హారన్ మ్రోగింది. కాస్సేపట్లో ఒక కారొచ్చి వాళ్ళ కారు వెనకనే ఆగింది. కారులోంచి దిగిన వ్యక్తివైపు ఆమె నవ్వుతూ చూసింది. హోటల్ గది గుమ్మంలో నిలబడి వున్నపుడు అతడే

"ఫైన్ కాశ్మీర్" అంటూ తన ముందునుంచి వెళ్ళిపోయాడు.

అతడు ఒంటరిగాలేడు. అతడితో ఒక కాశ్మీర్ యువతి వుంది.

సావిత్రి భర్త దగ్గరకు నడిచింది.

"పదండి తొందరగా పైకి ఎక్కుదాం" అందామె.

రాళ్ళ గుట్టపైకి వెళ్ళాలన్న ఉత్సాహం అతడికిప్పుడు లేదు.

"వీళ్ళుపోయాక వెళ్దాం" అన్నాడతను.

కారులో వచ్చినవాళ్ళిద్దరూ రాళ్ళగుట్టపైకి ఎక్కారు. సావిత్రి పక్కనే భర్త నిలబడి సిగరెట్ పీలుస్తున్నాడు.

"వీళ్ళిద్దరూ శని దేవతల్లా దాపురించారు" అన్నాడతను.

"వాళ్ళు ఎప్పుడు పోతారో! మనం ఆ లేక్ వైపు పోదాం పదండి" అందామె.

"గుడ్ ఐడియా" అని అతడు కారులో ఎక్కాడు.

ఆమె కూర్చుని తలుపు మూయగానే కారును పోనిచ్చాడు.

"వాళ్ళిద్దరూ అక్కడ ఏం చేస్తున్నారో!" అన్నా

డతను.

"వెళ్ళి చూద్దామా?" అందామె అమాయకంగా.

"సావిత్రీ, వాళ్ళకు కల్చర్ లేదు. ఒంటరిగా మనం వున్నప్పుడు మన దగ్గరే వాళ్ళు కారు దిగకూడదు. మరో చోటకుపోయి దిగాలి" అన్నాడతను.

"మనుషులు విచిత్రంగా ప్రవర్తిస్తారు" అందామె కష్టంగా.

అతడు కారును పోనిస్తున్నాడు. ఆప్యాయంగా ఆమె చేయి పట్టుకుని వేళ్ళు నిమురుతున్నాడు. చటుక్కున కారాపి, నలువైపులా చూసి, అతడామెను గట్టిగా కౌగలించుకుని ముద్దెట్టుకున్నాడు.

ఆమె వుక్కిరిబిక్కిరయింది.

"సావిత్రీ, ఐ లవ్ యూ! నీకోసం నా ప్రాణం కూడా యిస్తాను" అన్నాడతను.

"నాకోసం మీ ప్రాణం, మీకోసం నా ప్రాణం బలీయడం నాకు నచ్చదు. ఇద్దరం బ్రతుకుతూ ప్రేమించుకుందాం" అందామె.

రోడ్డుమీద జనసంచారంలేదు. రోడ్డు కిందకు దిగుతోంది. అనేక మలుపులు వున్నాయి. మరో పదినిమిషాల్లో ఒక సరస్సు పక్కనే అతడు కారు ఆపాడు.

ఇద్దరూ కిందకు దిగారు. దగ్గరగా వెళ్ళి సరస్సుకేసి చూశారు.

"హాయిగా స్నానంచేస్తే బాగుంటుంది" అన్నాడతను.

"చేయండి. నేను ఇక్కడ కూర్చుంటాను" అందామె.

"నువ్వు లేకుండా సరస్సులోకి దిగడం మజాగా వుండదు."

"నాకు ఈతరాదు. బాబోయ్, నేను రాను."

"నేను గజయీతగాడిని. నేనుండగా నువ్వు భయ పడనవసరంలేదు."

ఆమె నలువైపులా చూసింది. ఎక్కడా ఎవ్వరూ లేరు. దూరంనుంచి కారు హారన్ వినపడింది.

"అయితే స్నానంచేద్దాం, పదండి. నా కాలును ఏ మొసలో పట్టుకుంటే మీరే కాపాడాలి" అందామె.

కాస్సేపట్లో మరో కారొచ్చి సమీపంలో ఆగింది. రాళ్ళగుట్ట దగ్గర కనిపించిన యిద్దరూ కారు దిగి సరస్సు వైపు నడిచారు.

నాగేశ్వరరావు నిరుత్సాహంతో ఆమెవంక చూశాడు.

"మనం బయలేరిన క్షణం మంచిదికాదు, సావిత్రీ. శనిదేవత వీళ్ళ రూపాల్లో మళ్ళా వచ్చింది" అన్నా డతను.

ఆమె నవ్వి వూరుకుంది. పావుగంట తర్వాత అతడు సావిత్రి చెయ్యి పట్టుకున్నాడు.

"వీళ్ళు యిప్పట్లో వెళ్ళేటట్లులేరు. పద. పోదాం" అన్నాడతను.

"వాళ్ళు మన్ని ఎందుకిలా వెంటాడుతున్నారు? నాకు భయంగా వుంది" అందామె.

"కమాన్ భయపడకు! కాశ్మీర్‌కు వాళ్ళు మొదటి సారి వచ్చుంటారు. ఎక్కడికెళ్ళాలో తెలియక మన్ని ఫాలో అవుతున్నారు" అన్నాడతను.

ఇద్దరూ వెళ్ళి కార్లో కూర్చున్నారు. కారును వెనక్కు తిప్పి పోనిచ్చాడు నాగేశ్వరరావు. కొంచెం దూరం వెళ్ళేసరికి వెనకనుంచి కారు హారన్ వినపడింది.

"వాళ్ళు వస్తున్నారు, మన వెనక!" అన్నాడతను.

9

సందులో గబగబా నడిచాడతను. నిశ్శబ్దంగా ఒక గుడిసెలోకి అతడు ప్రవేశించాడు. గుడిసెలో పెద్ద కొవ్వొత్తిలు మూడు వెలుగుతున్నాయి. చాపమీద కూర్చున్నతను అతడివైపు చూశాడు.

“ఎవరు?” అడిగాడు కాసీమ్.

“సిటీలో పనుండి వచ్చాను.”

“ఏం కావాలి?”

“ఈ ఫోటోలో ‌వున్నామె జలగలా నన్ను అంటి పెట్టుకుని నా రక్తాన్ని పీల్చేస్తోంది. ఆమెను తొలగించాలి” అన్నాడతను.

“చంపాలా?” అడిగాడు కాసిమ్.

“చంపాలి.”

“25 వేలు అడ్వాన్స్ యివ్వాలి. ఆమె శవాన్ని నీకు చూపించాక మరో 25 వేలు.”

బాగ్ లోంచి ఐదుకట్టలుతీసి అతడు కాసీమ్‌కి ఇచ్చాడు. అతడు పళ్ళు యికిలిస్తూ డబ్బు తీసుకున్నాడు.

“ఆమె ప్రస్తుతం ఎక్కడుంది?”

“నా హోటల్ గదిలో.

“రేపుపొద్దుట తొమ్మిదింటికి ఆమెను షాపింగ్ చేసుకు రమ్మని ఒంటరిగా బయటకు పంపు. హోటల్‌నుంచి నే నామెను వెంటాడతాను. పని పూర్తిచేస్తాను. రేపురాత్రి యిక్కడికొస్తే ఆమె శవాన్ని నువ్వు చూడొచ్చు.”

“మంచిది.”

“నా గురించి నీకెవరు చెప్పారు?” అడిగాడు కాసీమ్.

“నా కారు నడిపే డ్రయివర్ చెప్పాడు.”

“ఆల్‌రైట్, వెళ్ళిరా!”

అతడు క్షణంసేపు కాసీమ్ వైపు చూశాడు. కాసీమ్ యమదూతలా వున్నాడు. అతడు బయటకు నడిచాడు. సందులో నడిచి వేగంగా వెళ్ళిపోయాడు.

* * *

సావిత్రి అతడి రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. ఎనిమిది తర్వాత వచ్చాడతను.

"ఎక్కడికి కెళ్ళారు?"

"మన డిస్ట్రిబ్యూటర్ ఆఫీసుకు వెళ్ళాను. వ్యాపార విషయాలు మాట్లాడుతూ కూర్చున్నాను"

"నేనూ మీతో వచ్చేదాన్నిగా! ఇక్కడ ఒంటరిగా వుంటే నాకు బోర్ కొడ్తోంది" అందామె.

"ఐ యామ్ సారీ ఇటుపైన నిన్ను హోటల్ గదిలో ఒంటరిగా వదలను" అని అతడామెను ముద్దెట్టుకున్నాడు.

"ఏదో తాగొచ్చినట్లు వున్నారు!" అందామె.

"మన ఏజంట్ స్కాచ్ విస్కీ యిచ్చాడు. వద్దంటే బాగోదని తాగేశాను."

"ఇప్పుడు మీ ప్రోగ్రామ్ ఏమిటి?"

"బయట చలిగా వుంది. డిన్నర్ ముగించి హాయిగా నిద్రపోదాం."

"నీకు నచ్చే ప్రోగ్రాము" అందామె.

10

పొద్దుటే యిద్దరూ గదిలోనే బ్రేక్‌ఫాస్టు సేవిస్తున్నారు. అతడు టైమ్ చూశాడు. ఎనిమిదైంది.

సావిత్రీ, నువ్వు కాశ్మీర్ చీరలు కావాలన్నావుగా! అమృత్ సిల్క్ స్టోర్స్ అనే షాపులో చక్కటి చీరలు నేను చూశాను. నీకు నచ్చినవి చూసి కొనుక్కో!" అన్నాడతను.

"మీరు రండి, వెళ్దాం" అందామె.

"నేను యివాళ రాలేను. మద్రాసు ఆఫీసుకు ట్రంకాల్బుచేసి కొన్ని విషయాలు మాట్లాడాలి. అబ్బులా అర్జంటుగా కొంత స్టాకు కావాలన్నాడు."

"మీరు వస్తేగాని నేను వెళ్ళను" అందామె.

అతడు నవ్వుతూ ఆమెవైపు చూశాడు.

"సావిత్రీ, అమృత్ సిల్క్ స్టోర్స్ మన హోటల్ కి ఎదురుగా వున్న రోడ్డుమీద వుంది. హాయిగా నడిచి వెళ్ళు. ఐదునిమిషాలుకూడా పట్టదు. షాపు యజమానికి చెప్పాను. నిన్ను తొమ్మిదింటికి పంపుతానని."

"మీరు చెప్పాక వెళ్ళకపోతే బాగోదు. వెళ్తాను" అందామె.

తొమ్మిది అవుతుండగా అతడామెను హోటల్లోంచి బయటకు తీసుకెళ్ళాడు. ఎదురుగా వున్న రోడ్డు చూపించాడు.

"అక్కడే నిద్రపోకు! తొందరగా రా, లేకపోతే నాకు బోరుకొడ్తుంది" అన్నాడతను.

"డబ్బు పట్టుకెళ్ళొద్దూ?" అడిగిందామె.

"నీకెన్ని చీరలు కావలసినా వాటిని ఎన్నుకుని హోటల్ కి తెచ్చి డెలివర్ చేయమను. వాళ్ళు అలా చేస్తారు" అన్నాడతను.

ఆమె గేటు దాటి వెళ్ళింది. నాగేశ్వరరావు నిలబడి ఆమెవైపే చూస్తూ వుండిపోయాడు.

అమాంతంగా ఏదో కారొచ్చి ఆమె పక్కనే ఆగింది. ఒకతను ఆమెను బలాత్కారంగా కార్లో ఎక్కించి తలుపు మూశాడు. కారు దూసుకుపోయింది.

అతడి గుండె దడదడలాడింది. అతడు వేగంగా

హోటల్ గదికి చేరుకున్నాడు. బజ్జర్ నొక్కాడు. హోటల్ బాయ్ పరుగెత్తుకొచ్చాడు.

"స్కాచ్ విస్కీ అండ్ సోడా! ఫుల్ బాటిల్ విస్కీ!" అన్నాడతను.

హోటల్ బాయ్ బాటిల్, సోడాబుడ్లు తెచ్చి అతడిముందు వుంచాడు. ఒక గ్లాసును టీపాయిమీద పెట్టాడు.

"ఇంకా ఏమైనా కావాలా, సార్?"

"నథింగ్, నువ్వు వెళ్ళొచ్చు" అన్నాడతను.

హోటల్ బాయ్ వెళ్ళిపోయాడు. తలుపు దగ్గరగా మూయబడింది.

గ్లాసులో ఎక్కువగా విస్కీపోసి అతడు సోడా కలిపాడు. గ్లాసులోని విస్కీని గడగడ తాగేసి సిగరెట్ వెలిగించాడు.

నిమిషాలు దొర్లిపోతున్నాయి. చీరలు కొనడానికి వెళ్ళిన సావిత్రి యింకా రాలేదు. ఆమె యింక రాదు!

అతడు టైము చూశాడు. పన్నెండు కావస్తోంది. టెలిఫోన్ రిసీవర్ ఎత్తి మద్రాసుకు ట్రంకాల్ బుక్ చేయమని చెప్పాడు. అర్జంటు కాల్!

అరగంట తర్వాత టెలిఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ ఎత్తాడు.

"హలో!" అన్నాడు.

"స్పీకవ్ టు సత్యభామ, మద్రాస్" అందో కంఠం.

"హలో, భామా!" అన్నాడతను.

"సత్యభామనే. కాశ్మీర్ ఎలా వుంది?"

"నువ్వు లేకుండా ఎలా వుంటుంది, నరకంలా తప్ప" అన్నాడతను.

"ఎప్పుడొస్తున్నారు?"

"రెండు మూడు రోజుల్లో."

"మీ రాకకోసం ఎదురుచూస్తూ వుంటాను."

"శ్యామా, అక్కడి న్యూస్ ఏమిటి?"

"అంతా మామూలే. చెప్పవలసిందేమీ లేదు—"

"ఆల్ రైట్, వుంటాను" అని అతడు రిసీవర్ పెట్టేశాడు.

హోటల్ బాయ్ గదిలోకొచ్చాడు.

"సార్, లంచ్ పట్రానా?"

"పట్రా" అన్నాడతను.

గది నలువైపులా చూసి, "ఇద్దరికేనా?" అడిగాడు బాయ్.

అతడు అవునన్నట్లు తలాడించాడు.

హోటల్ బాయ్ వెళ్ళిపోయాడు. అతడు విస్కీ గ్లాసును అందుకున్నాడు.

11

లంచ్ సేవించి అతడు పరుపుమీద వాలిపోయాడు. వెంటనే నిద్ర పట్టేసింది.

రెండుసార్లు హోటల్ బాయ్ తలుపుతోసి లోపలకు చూశాడు. అతడు నిద్రపోతున్నాడని గమనించి, లైట్ ఆన్ చేసి వెళ్ళిపోయాడు.

నాగేశ్వరరావు కళ్ళు తెరిచేసరికి గదిలో లైటు వెల్గుతోంది. అతడు టైమ్ చూశాడు. తొమ్మిది దాటింది.

కాసీమ్ అతడికి గుర్తుకొచ్చాడు. అతడు వెంటనే లేచాడు. బాత్‌రూమ్‌లోకి వెళ్ళి మొహం కడుక్కున్నాడు. హేంగోవర్‌తో అతడు బాధపడుతున్నాడు. గ్లాసులో కొంత విస్కీ పోసుకుని అతడు తాగేశాడు.

దుస్తులు మార్చుకుని అతడు బయటకు వెళ్ళాడు. హోటల్ గది తలుపుమూసి లాక్ చేశాడు.

ఫియట్ కారుపక్కనే డ్రయివర్ నిలబడి వున్నాడు.

"అహమ్మద్, నువ్వెళ్ళు" అని అతడికి పదిరూపాయలు యిచ్చాడతను.

ఫియట్ కారును అతడు బయటకు పోనిచ్చాడు. రోడ్డు లైట్లు వెల్గుతున్నాయి.

ఒకచోట కారు ఆపి అతడు దిగాడు. కుడివైపున్న సందమ్మట వేగంగా నడిచాడు. ఒక గుడిసెలోకి ప్రవేశించాడు.

కాసీమ్ భయంకర రూపం అతడికి కనిపించింది.

"నీకోసమే చూస్తున్నా. పని పూర్తయింది" అని అతడు నాగేశ్వరరావువైపు చూశాడు.

"శవం ఎక్కడుంది?"

గోడవారగా తెల్లటి దుప్పటి పరచివుంది. కాసీమ్ దుప్పటిని వెనక్కిలాగాడు.

రక్తం చిమ్మిన ఆమె మొహంకేసి చూసి అమాంతంగా అతడు పక్కకు తిరిగాడు.

తన జేబులోంచి ఐదు నోట్లకట్టలు తీసి అతడు కాసీమ్‌కి యిచ్చాడు.

"ఈ శవాన్ని ఎక్కడేనా పారేస్తే పోలీసులకు దొరుకుతుంది. దాన్ని కాల్చిపారేస్తే నీకు ప్రమాదం వుండదు" అన్నాడు కాసీమ్.

"శవాన్ని కాల్చి పారేయండి" అన్నాడతను.

"ఆ పనికి మరో పదివేలు యివ్వాలి."

అతడు రెండు కట్టలుతీసి అతడికిచ్చాడు.

"ఈ రాత్రే కాల్చేస్తాను" అన్నాడు కాసీమ్.

"ఆమె ఒంటిమీదున్న నగలు నాకు రావాలి" అన్నాడు నాగేశ్వరరావు.

కాసీమ్ గంభీరంగా నవ్వాడు.

"ఆమె ఒంటిమీద వున్నదంతా మాదే. ఏదీ నీకు తిగిరాదు" అన్నాడు కాసీమ్.

"ఒప్పుకుంటున్నాను" అని అతడు బయటకు నడిచాడు.

కారు దగ్గరకు చేరుకున్నాడు. వెంటనే కారు దూసుకుపోయింది.

12

నాగేశ్వరరావు ఆమెవైపు నవ్వుతూ చూశాడు. అమాంతంగా ఆమెను కౌగలించుకుని, పెదిమలమీద ఆవేశంతో ముద్దెట్టుకున్నాడు.

"భామా!" అన్నాడతను.

"చెప్పండి" అందామె.

"ఇటుపైన మన పెళ్ళికి ఏ అడ్డంకులూ లేవు."

"మీ భార్య?"

"దేవుడు ఆమెను తొలగించేశాడు. ఆమె బస్ యాక్సిడెంట్ లో మరణించింది."

సత్యభామ నిర్ఘాంతపోతూ అతడివైపు చూసింది.

"ఏమైందో వివరంగా చెప్పండి."

"ఇద్దరం రోడ్డమ్మట నడుస్తున్నాం. వెనకనుంచి ఒక బస్సు అమాంతంగా మావైపు వచ్చింది. నేను దూరంగా దూకేశాను. ఆమె టైర్ కిందపడి మరణించింది. పోలీసులు ఆమె శవాన్ని నాకు అందజేశాక అక్కడే దహనం చేసి వెనక్కు తిరిగి వచ్చేశాను" అన్నాడతను.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"నాకోసం మీరామెను ఆ విధంగా చంపలేదుగా?"

ప్రశ్నించిందామె.

అతడు ఆమెకేసి చూశాడు. అతడి కళ్ళమ్మట నీళ్ళు కారాయి.

"భామా, నిజం చెప్తున్నాను. ఆమెను నేను చంప లేదు. భగవద్గీత చేతిలో పట్టుకుని యిదే చెప్తాను."

ఆమె మౌనంగా అతడివైపు చూసింది.

"ఆమె ఆ విధంగా మరణించినందుకు విచారిస్తు న్నాను" అందామె.

"భామా, అయిందేదో అయిపోయింది. ఆమె చావు గురించి ఏడ్వడానికి తలిదండ్రులు లేరు. ఆమెకు నేను తప్ప మరెవ్వరూ లేరు."

కొంతసేపు యిద్దరూ మౌనంగా వుండిపోయారు.

"భామా, మన పెళ్ళికి యింకా ఆలస్యం ఎందుకు?" అన్నాడతను.

"మీరు వచ్చి నాన్నతో మాట్లాడండి."

"ఎప్పుడు రమ్మంటావు?"

"ఇవాళ సాయంత్రం, ఆరు తర్వాత" అందామె.

ఆమె గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది. అతడు ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాడు.

సావిత్రి మరణం గురించి యెవ్వరూ యెక్కువగా పట్టించుకోరు. ఆమెకు దగ్గర చుట్టాలు లేకపోవడం తన అదృష్టం.

సాయంత్రం ఆరింటికి అతడు కారులో సత్యభామ యింటికి వెళ్ళాడు.

రెండు గదుల్లో సత్యభామ తలిదండ్రులతో జీవి స్తోంది.

సత్యభామ అతడిని ముందు గదిలోకి తీసుకువెళ్ళింది.

లుంగీ, బనియన్‌లో వున్నాడామె తండ్రి.

"రండి, కూర్చోండి" అన్నాడు కామరాజు.

నాగేశ్వరరావు కుర్చీలో కూర్చున్నాడు. కామరాజు అతడివైపు నవ్వుతూ చూశాడు.

"అమ్మాయి అంతా చెప్పింది. మీ భార్య యిప్పుడే మరణించిదిగా! రెండు మూడు నెలలు గడిచిన తర్వాత పెళ్ళిచేసుకోడం మంచిదేమో" అన్నాడతను.

"ఆలస్యం చేయడం నాకు వీలుకాదు. నాది పెద్ద యిల్లు. ఎందరో నౌఖర్లు. నేను రోజల్లా ఫాక్టరీలో వుంటాను. ఎవరూ యింట్లోలేకపోతే నా యిల్లు గుల్లయి పోతుంది."

"అయితే ముహూర్తం పెట్టిస్తాను."

"వీలైనంత వేగంగా మా పెళ్ళి అవ్వాలి" అన్నాడతను.

"అలాగే అవుతుంది."

"మామగారూ, పెళ్ళి మా యింట్లోనే జరుగుతుంది. మీకు పైసా ఖర్చు వుండదు" అన్నాడతను.

"ఆలస్యంగానైనా సరైన అల్లుడు దొరికినందుకు సంతోషిస్తున్నాను" అన్నాడు కామరాజు.

13

నాగేశ్వరరావు కాంపౌండులో విశాలమైన పందిరి. పందిరిలో పెళ్ళి అవుతోంది.

వందలాది అతిథులు కుర్చీల్లో కూర్చుని వున్నారు. ముహూర్తం దగ్గరవుతోంది.

పందిరిలో చాలా సందడిగా వుంది. పురోహితుడు మంత్రాలు పఠిస్తున్నాడు.

పక్క కూర్చున్న సత్యభామవైపు నాగేశ్వరరావు నవ్వుతూ చూశాడు. ఇటువైపున ఆమె పూర్తిగా తనకు లొంగవలసిందే.

పీటమీద కూర్చున్న నాగేశ్వరరావు లేచి నిలబడ్డాడు. సమీపంలో నిలబడి వున్న వ్యక్తివైపు చూసి త్రుళ్ళి పడ్డాడు.

పెళ్ళికూతురు వెనక సావిత్రి నిలబడివుంది!

ఆమెవైపే చూస్తున్నాడతను. అతడి చేతిలోని మంగళ సూత్రం కిందపడింది. అతడు భయంతో దూరంగా అడుగులు వేశాడు.

సావిత్రి అతడివైపు గబగబా నడిచింది.

"నన్ను చూసి భయపడకండి! నేను దయ్యాన్ని కాను" అర్చిందామె.

"నీ శవాన్ని నా కళ్ళతో చూశాను. నువ్వు బతికి యిక్కడికెలా వచ్చావు?" నాగేశ్వరరావు గాభరాగా అడిగాడు.

పందిరిలో నిశ్శబ్దంగా వుంది.

అందరి చూపూ సావిత్రిమీదే కేంద్రీకృతమైంది. సత్యభామ నిలబడి అంతా మౌనంగా చూస్తోంది.

సావిత్రి పందిరిలో వున్న పెద్దలవైపు చూసింది.

"నాగేశ్వరరావుగారు నా భర్త. మా పెళ్ళయి ఆరేళ్ళు దాటింది. ఆప్యాయంగా ఆయన నన్ను కాశ్మీర్ రమ్మన్నారు. ఆయనకంత ప్రేమ నామీద ఎందుకు పుట్టుకొచ్చింది? ఏదో అనుమానం నాలో తలెత్తింది. కాశ్మీర్ వస్తానని ఆయినతో చెప్పాను. కాని తగువిధంగా జాగ్రత్తపడ్డాను. మద్రాసులో వుండే డిటెక్టివ్ కాళిదాసుగార్ని కలుసుకున్నాను. కాశ్మీర్ వచ్చి ఏ ఆపదా

రావకుండా నన్ను కాపాడమన్నాను."

ఆమె ఆగింది.

"తర్వాత ఏమైందో చెప్పండి" అన్నారెవరో.

"కాశ్మీర్ వెళ్ళాక ఏదోవిధంగా నన్ను చంపాలని ఆయన ప్రయత్నించారు. కాని అది సాధ్యంకాలేదు. ఆయన ఏదేనా చేసేముందే కాళిదాసుగారు మారు వేషంలో మేమున్నచోటకు వచ్చేవారు. ఆయనకు విసుగెత్తింది. డబ్బిచ్చి నన్ను చంపించాలని ఆయన నిశ్చయించుకున్నారు. కాశ్మీర్‌లో మా డ్రయివర్ అహమ్మద్ ద్వారా ఆ విషయం నాకు తెలిసింది. కాసీమ్ అనే కిరాతకుడు డబ్బిస్తే యెంతమందినేనా చంపుతాడని అహమ్మద్ చేత మేం ఆయనకు చెప్పించాం. ఒక గుడిసెను అద్దెకు తీసుకుని కాళిదాసుగారే కాసీమై అక్కడ వున్నారు. అది పాపం ఆయనకు తెలియదు. కాసీమ్ గుడిసెకు వెళ్ళి ఆయన డబ్బు చెల్లించారు, నన్ను చంపమని. రోడ్డమ్మట నేను వెళ్తూండగా కారులో కాళిదాసుగారొచ్చి నన్ను యెత్తుకుపోయారు. యెర్రరంగు పులిమిన నా ముఖాన్ని ఆ రాత్రి నా భర్తకు చూపించారు. నేను చంపబడ్డాననుకుని, నన్ను కాల్చిపారేయమని నా భర్త మరో పదివేలు చెల్లించి హోటల్‌కి వెళ్ళిపోయారు. అక్కడినుంచి మద్రాసువచ్చి తను మోజుపడ్డ సత్యభామను పెళ్ళాడ్డానికి సిద్ధపడ్డారు."

సావిత్రి ఆగింది. సమీపంలో వున్న సత్యభామవైపు చూసింది.

"నా భర్త మానసికంగా హంతకుడు. అటువంటి వ్యక్తిని యీమె పెళ్ళాడ్డానికి అంగీకరించినందుకు నేను చాలా విచారిస్తున్నాను."

సత్యభామ నాగేశ్వరరావువైపు కోపంగా చూసింది.

"ఆ కిరాతకుడిని నేను పెళ్ళాడను. మీరు బస్సు యాక్సిడెంట్‌లో మరణించారని నాతో అబద్ధమాడి ఆయన నన్ని పెళ్ళికి ఒప్పించారు" అంది సత్యభామ.

"తన కోర్కెలు తీర్చుకోడానికి ఆయన ఎంత నీచమైన పనైనా చేస్తారు" అంది సావిత్రి.

పందిరిలో వున్న పెద్దలు నాగేశ్వరరావు వైపు చెప్పులు విసిరారు. అతడు ఏడుస్తూ వెళ్ళి సావిత్రిముందు పడ్డాడు.

"సావిత్రీ, నన్ను క్షమించు. నీ యిష్టమొచ్చినట్లు నన్ను శిక్షించు! నేను కిరాతకుడిని" అర్చాడు నాగేశ్వర రావు, ఏడుస్తూ.

"లేవండి" అంది సావిత్రి.

అతడు లేచి నిలబడ్డాడు.

"మిమ్మల్ని మన్నిస్తున్నాను. ఆ నాటి సావిత్రి చనిపోయిన తన భర్తకు జీవంపోసి వెనక్కి తీసుకొచ్చింది. నేను యీనాటి సావిత్రిని భర్త చేతుల్లో చావకుండా ప్రాణాన్ని నిలుపుకుని తిరిగి రాగలిగాను" అందామె నవ్వుతూ.

—: అయిపోయింది: —